

# అమెరికా అమ్మాయి

## - శ్రీనిధి యెల్లల



**ఉద్యోగాలకోసం కొందరు**, చదువుల కోసం కొందరు, ఇలా వారి వారి కలల వెంటపడి చేరుకునే గమ్యం ఒకటి ఉంది ....అదే అమెరికా!

చిన్నతనంలో ఎంతో అబ్బురంగా, స్వర్గానికి మరోపేరుగా తలచిన దేశం. అక్కడి విశేషాలు, వస్తువులు, అక్కడినుంచి వచ్చిన మనుషులూ, అందరూ ఎంతో గొప్పవారనీ దేశంలో ఎంతటి పేరున్న గుడి వారైనా పూర్ణ కుంభంతో స్వాగతం పలికేటంత వి.వి .ఐ పీలు అనీ అనుకునే రోజుల నుండీ ... "ఆ వదినా మా పిల్లకి ఆవకాయ్ పట్టడానికి సాయానికి అమెరికా వెళ్తున్నాను దార్లో మీ అబ్బాయికి ఏమైనా ఇవ్వాలంటే ఇవ్వు, ఇచ్చేసి వస్తాను" అనే రోజుల్లోకి వచ్చేసాము .

దూరం కొద్దీ విలువని అంచనా వేసే మనం, ఆ దూరం తగ్గిపోయేసరికీ విలువనీ తగ్గించేస్తున్నామేమో?

ప్రపంచంలో అందరూ రెండే రెండు రకాల వారి గురించి చర్చిస్తూ ఉంటారు. ఒకళ్ళు ఉత్తములు అయితే మరొకళ్ళు అధములు. వీళ్ళు కాకుండా మరొక రకం ఉంది అదే మధ్యముల్ అన్నమాట. పై చెప్పిన రెండు రకాల వారి గురించి చర్చిస్తూ ఉంటారు . వీళ్ళ గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోరు. కానీ వారు మాత్రం అందరి సమస్యలు నెత్తిన వేస్కుని భూభారాన్ని మోసేస్తూ ఉంటారు. ఆ కేటగిరీలో ఫస్టు ఉండేవాళ్ళలో నేనొకదాన్ని. ఉద్యోగం వదిలేసి భర్త వెంట అమెరికా వాసం వచ్చిన కాండిడేట్ ని. వీసా సమస్యల వల్ల ఇంట్లో చిక్కుకుపోయి , రోజూ న్యూస్ లో వచ్చే అమెరికా వార్తలు విని నాకెప్పుడూ ఉద్యోగం వస్తుందో అని లెక్కలు వేసే చుట్టాలని మేనేజ్ చేస్తూ, ఒంటి చేత్తో ఇంటినీ, పిల్లల్ని మేనేజ్ చేస్తూ, ఉద్యోగాలకి వెళ్లే ఆడవారి వైపు ఆరాధనగా, హడావిడిగా కాలేజులకీ పార్టీలకి వెళ్లే పిల్లల వైపు ఈర్ష్యగా, ఇప్పుడే కొత్తగా వచ్చిన వారిని తేలిగ్గా చూస్తూ, గడుసుగా ఈ అమెరికా వాసాన్ని ఈదుతూన్న ఒక సగటు తెలుగు పిల్లని.

మబ్బుల చాటు తొలగిపోతున్న కొద్దీ, కాస్తకాస్తగా బయటపడుతున్న అందమైన దేశాన్ని విమానపు కిటికీలోంచి ఆనందాతిశయంతో చూసిన మొదటి క్షణాలు ఎన్నటికీ మరచిపోలేను. చదివిన చదువూ, చేసిన ఉద్యోగం దేనివల్లనైతేనేం సిగ్గు, బిడియాలు అనే ఆభరణాలు పాతవైపోయి పర్యుత్సుకత, ఉత్సాహం అనే అలంకారాలు మాత్రమే ధరించిన ఈకాలపు అమ్మాయిని. ఎయిర్ పోర్ట్ నుండి బయట పడి అమెరికా గడ్డపై నిలబడ్డప్పుడు మొట్ట మొదటగా గమనించిన మార్పు, మనుషుల కరువు. ఒక్క నిమిషం ఉక్కిరిబిక్కిరి చేసిన ఒంటరితనం. చిన్న కలవరపాటు. రివ్వున వీస్తున్న చల్లటి గాలికి కళ్ళలో ఊరిన తడికి అస్పష్టంగా అల్లుకుని పోయినట్టు ఉన్న బంగారు అక్షరాలు . తేరుకుని చూద్దును కదా, అరచేతిలో ఉన్న పాస్ పోర్టుపై "సత్యమేవ జయతే" అన్న అక్షరాలు. నువ్వు నా బిడ్డవి, నీకు ఎదురే లేదు అని ఎదో శక్తి భుజంతట్టిన భావన. అలా పడింది అమెరికా నేలపైన నా మొదటి అడుగు. ఇక్కడి ప్రస్తుత జీవనం, ఇన్ని సుఖాల మధ్య ఉండే కష్టాలు, ఉక్కిరిబిక్కిరి చేసేంత పని లేదా పిచేక్కించేంత ఏకాంతం, చదువుకునేందుకు పాట్లు, ఉద్యోగపు వేటలు, తల్లితండ్రుల ఆశలు పిల్లల ఆశయాలు ఇలా ఎన్నో విశేషాలు. ఈ భావోద్వేగపు రంగులరాట్నంలో నాతో పాటు షికారుకు తయారు అవ్వండి మరి..

★★★

## వ్యర్థ (వృధా) ప్రయాస

వాట్సాప్ లో ఈరోజు ఫార్వర్డ్ అయిన వీడియో చూసినప్పటినుండి మనసు మనసులో లేదు. తెలిసీ తెలీకుండా ఎన్ని ఘోరాలు చేస్తున్నానో అని ఒకటే దిగులు పట్టుకుంది. అమెరికాలో ఆహారపు వ్యర్థాల గురించిన వీడియో అది. తాజా లెక్కల ప్రకారం సగటున ఒక రోజుకి 150,000 టన్నుల ఆహారం పడేస్తున్నామట. అంటే ఇంటికి నాలుగు సంచీల సరుకు తీసుకొస్తే ఒక సంచీడు సామాను సరాసరి ట్రాష్ కాన్ లో పడేసినట్టు లెక్క. వండకుండా, వాడకుండానే ట్రాష్ కాన్ లో పడే పండ్లూ, కూరగాయలు మిగతా తిండి పదార్థాలు కలిపి ప్రతి కుటుంబం ఏడాదికి 2000 డాలర్లు ఏట్లో పోస్తున్నారట. రెండువేల డాలర్లు!!! ... ఏడుకొండలవాడా! అమ్మనీ, నిన్ను చూసేటందుకు సగటు తెలుగు కుటుంబం రెండేళ్లకోసారి చూసి, చూసి చేసే ఖర్చు అది. వీడియోలో ఆ లెక్కలు, ఆ వేస్టేజి చూస్తుంటే తల తిరిగిపోయింది. నేను కూడా ఈ అగ్గికి నావంతుగా ఆజ్యం పోస్తున్నానుగా!

ఒక్క నిమిషం చుట్టూ ఇంట్లో చూద్దును కదా, సగం పైగా బాగా మగ్గిపోయిన ఆప్రికాట్సు, మమ్మల్నెప్పుడు తింటావు అని దీనంగా చూస్తున్న పుచ్చకాయ, దోసకాయ, ఎక్కి తొక్కి రోజూ తిన్నా ఇంకా మిగిలే ఉన్న ఆపిల్సు, నారింజలు. ఫ్రిడ్జ్ లో ముక్కుతూ, మూలుగుతూ ఉన్న కూరగాయలు. “మాకు ఎప్పుడు విడుదల?” అని ఫ్రీజర్ డోర్లో కుక్కి ఉన్న లెక్కలేనన్ని పధార్థాలు. దేవుడా! ఊపిరి ఆడటం లేదు నాకు. ఆ వీడియోలో చూపెట్టిన లెక్కలన్నీ కళ్ళముందు డిస్కో డాన్స్ చేస్తున్నట్టు ఫీలింగ్. ఇంత అన్యాయంగా బతికేస్తున్నానా నేను? ఎందుకింత తిండి సామాను. అచ్చంగా తినడానికే బతుకుతున్నట్లు ఉంది. ముందు ఈయనకి కూడా ఈ వీడియో చూపించాలి. వద్దు మొర్రో అంటున్నా, నేను చెయ్యలేను కుర్రో అంటున్నా వినకుండా ఆఫర్లో ఉన్నాయనో, డిస్కౌంట్ అనో, సీజన్లో అనో బుట్టెడు సామాను నెత్తిన తెచ్చి పడేస్తాడు.

ఇంతా చేసి మాదేమన్నా పెద్ద సంసారమా అంటే అదీ కాదూ. లింగు లింగు మని ఇద్దరం. ఒక చుట్టమా పక్కమా?! ఎంత చేసినా జానెడు పొట్టే కదా. పైగా అన్నిటికి ఆర్గానిక్, కాస్టుకో (పెద్ద హోల్ సేల్ షాప్) అంటాడు . ఈ కాస్టుకో వాడిని ఏమీ అనలేము, అంత నమ్మకంగా ఇస్తాడు సామాను. ఏదైనా సరే కళ్ళు మూసుకుని కొనేయొచ్చు. కానీ చిక్కల్లా ఏంటంటే అన్ని చిన్న సైజు కుంభకర్ణుడి ఫ్యామిలీకి సరిపోయే మోతాదుల్లో ఉంటాయి. బ్రెడ్డు కొందామంటే మూరెడేసి ప్యాకెట్లు రెండు కలిపి ఇస్తాడు, కోడిగుడ్లు హీనపక్షం రెండు డజన్ల నుండీ మొదలు, ఇక పండ్ల సంగతి సరే సరి. ఎవరిళ్ళలో చూసినా కాస్టుకో సరుకే. నలుగురితో నారాయణ అనడమే కదా మన పని. “మేము కాస్టుకో పాలే తాగుతాము, అక్కడి వెన్ననే కాచుకుంటాము” అని ఓ..ఒకటే రాగాలు. మిగతా షాపు ధరలకే ఎక్కువ సరకు తెచ్చేసుకుంటున్నామని పొంగిపోవడమే గానీ, అందులో వాడలేక చెత్త బుట్ట పాలు చేసిన తిండి విలువ ఏమిటనే ఆలోచనే రాలేదు . ఛి ఛీ ..ఏం తెలివి నాది?

సబ్బులూ, షాంపూలు అంటే పోనీలే తొందరగా పాడవ్వవు అని ఎన్నైనా కొనచ్చు. దాచుకుని వాడొచ్చు. ఈ తినే వాటిని ఏం చేసుకోము చెప్పండి. కొంటే డబ్బాల లెక్కన, సంచీల లెక్కన కొనాలి. పోనీ ఒక్కో మారు ఒక్కో రకం తెచ్చుకుందామంటే, ఒక డబ్బాడు తినేలోపు ఆ డబ్బాలో ఉన్న దానిపైన మనసు విరిగి విరక్తి వచ్చేస్తుంది. "ఇంకోచోట కావలసినన్ని మాత్రమే తెచ్చుకోవచ్చు కదా, ఇంత దేశంలో షాపులే లేవా ?" అని అడిగితే నేనేమి చెప్పలేను. ఒకరు మంచిది అన్నాక, "ద బెస్టు సరుకోయ్" అన్నాక ఇంకో చోటుకి వెళ్తే నేను తెలుగు పిల్లని ఎలా అవుతాను. అందరూ చేసేదే నేనూ చెయ్యాలి కదా! లేకపోతే వాళ్లకన్నా నా ఆరోగ్యం తక్కువ అయిపోతుందేమో, నేనేదైనా మిస్ ఐపోతానేమో అనే ఆరాటం. కానీ నా ఈ ఆరాటంతో ఇంత ఆగడం అయిపోతోందని అనుకోలేదసలు.

చెంబుతో కాసిన్ని నీళ్లు ఎక్కువగా దిమ్మరించినా, "ఊరికే ఎందుకె అలా కులబోస్తావు నీళ్లు, అలా చేస్తే లక్ష్మి నిలుస్తుందా చేతుల్లో!,” అనేది అమ్మమ్మ. ఇంట్లోనే పాడి ఉన్నా, అలా గరిటెడు పాలు ఆగడం కానిచ్చేది కాదు. ఆహా ఏం సంసారాలు అవి!! “ఎప్పటికైనా గుర్తు పెట్టుకో అమ్మణ్ణి, కానుగ చెట్టు కన్న తల్లి చింత చెట్టు చిన్నమ్మ లాంటివి" అనేది. ఏవో పిచ్చి సామెతలు అనుకున్నాను గానీ, అందులోని సత్యాన్ని గుర్తించలేదు ఎప్పుడూ. చదువుకోకపోయినా, జిల్లా దాటాకపోయినా తనవల్ల ఈ భూమికి ఏ హాని లేకుండా వెళ్ళి పోయింది. మమ్మల్ని చూస్తే ఇదీ వరుస. ఉంది కదా అని కొనేసెయ్యడం, తీరా సర్దుకోలేక పారేసుకోవడం. ఇన్నిన్ని చదువులు చదివేస్తున్నాము, దేశ దేశాలు తిరిగి గడించేస్తున్నాము. కానీ మేము తెలీకుండా చేసే పనుల వల్ల జరిగే హాని గానీ , రాబోయే సమస్యల గురించి పట్టింపు కానీ ఏమైనా ఉందా? ఇదేనా మేము సాధించిన ప్రగతి?

“పొందిగ్గా ఉండటం నేర్చుకోవే,” అని అమ్మా , అమ్మమ్మా చెప్తే ఛాదస్తం అనుకునేదాన్ని. చూడండి గుట్టుగా, మితంగా వాడుకోకపోతే వచ్చే కష్టాలు. మనం సుబ్బరంగా తినేసి వెళ్ళిపోతే సరా?..ఇదే లెక్కన పారేసుకుంటూ పోతే రేపొద్దున మన పిల్లలు, వాళ్ళ పిల్లల తరాలకి మిగిలేది ఈ వ్యర్థపు కుప్పలే కదా.

ఇలాక్కాదు .. ఇకపై నుండి ఒక పద్దతిగా వాడుకోవాలి అని నిర్ణయించుకున్నాను. ఎలాగో అలాగా ఈ వెస్టేజ్ కొంచం తగ్గించాలి. సగం నోటికి , సగం ట్రాష్ కి పంపే పద్ధతి మార్చాలి. సంచులు సంచులు నిండే ట్రాష్ బ్యాగ్లను అదుపులోకి తీస్కుని రావాలి, అనుకుని బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చా. ఎలాగూ మా అపార్ట్మెంట్ లో అందరిదీ ఇదే సమస్య కాబట్టి, కావలసిన సరుకుని పంచుకుని వాడుకుంటే సరిపోతుంది కదా? డబ్బులు ఇచ్చి పుచ్చుకోడానికి ‘స్ప్లిట్ వైస్’ అనీ అవని ఇవనీ బోలెడు ఆప్స్ ఉన్నాయి. ఆలోచన వచ్చిందే ఆలస్యం మా వాట్స్ ఆప్ గ్రూప్లో ప్రతిపాదించేసాను . ఈ ‘మిగులు’ అనేది అందరికీ సమస్యే కదా. అందరూ ఒప్పేసుకున్నారు వెంటనే.

ఇక ఇన్ బాక్సు మోత మోగించేసింది.

అపార్ట్మెంట్ #202: మా ఇంట్లో బ్రోకలీ సంచెడు తెచ్చాము, సగం కావలిసిన వారు రావొచ్చు.

అపార్ట్మెంట్ #507: అది ఆర్గానిక్ ఏ నా ? అయితే నేను తీసుకుంటాను. నా దగ్గర రెండు గాలేన్ల పాలు ఉన్నాయి... మాకు ఒకటి చాలు . ఎవరికైనా కావాలంటే రావొచ్చు.

అపార్ట్మెంట్ #302: బస్తాడు బంగాళాదుంపలు కలవు. వాటాలు వేసుకుని తీసుకోడానికి రావొచ్చు.

అపార్ట్మెంట్ #215: ఇంకా తెరువని కార్న్ ఫ్లేక్స్ డబ్బాలు పెద్ద సైజువి రెండు, ఛీజ్ ప్యాకెట్టు ఒకటి , మిగల ముగ్గిపోడానికి సిద్ధంగా వున్న అవకాడోలు ..ఫ్రీ గా తీసుకొనిపొండి ... రండి.

అపార్ట్మెంట్ #420: గ్రీన్ టీ ప్యాకెట్లు , పనీరు, క్యారెట్ల సంచీ పంచుకోడానికి సిద్ధం. త్వరగా రావాలి.

అపార్ట్మెంట్ #209: సంచెడు నిమ్మకాయలు, ఒకేసారి పండి కూర్చున్న రెండు డజన్ల అరటికాయలు మాతోపాటు పంచుకుని మా భారం తీర్చండి.

ఇలా ఒకేసారి వరదలాగా వచ్చిన మెసేజీల తాకిడికి నా ఫోను మారుమోగిపోయింది. చూసారా నాలాగే ఎంత మంది ఉన్నారో!. ఆరోగ్యానికి మంచివని, పిల్లలకి ఇష్టమని, చవక అని, చూడడానికి ముచ్చటగా ఉన్నాయని ఓ తెగ కొనేయడం వాటిని సరిగ్గా వాడలేక సరాసరి చెత్త బుట్టలో వేసెయ్యడం. ఒకేసారి ఎన్ని పళ్ళని తింటాము, ఎన్ని పాలని తాగుతాము, ఎన్ని గుడ్లని మింగుతాము? ఒక్క మా అపార్ట్మెంట్ వరకే ఇలా ఉంటె ఇక దేశం సంగతి చెప్పాలా. 'దేశమంటే మనుషులోయ్' అని ఊరికే అన్నారా?

మొత్తానికి ఇలా గ్రూప్ లో ఒకరి దగ్గర ఎక్కువగా ఉన్న సరకు కావలసిన వారు తీసుకుంటూ, తమ దగ్గర ఉన్న మిగులుని మిగతా వారితో పంచుకుంటూ కొన్ని రోజులు బాగానే గడిపేసాము. మా చిన్ని అపార్ట్మెంట్స్ వరకైనా విజయం సాధించాము అనుకున్నా. కానీ అన్ని రోజులూ ఒకలా ఉంటే ఎలా, అన్ని బుర్రలూ ఒకలా ఆలోచిస్తే ఎలా?

ఆరంభ శూరత్వంలో ఈ పంపకాలు, పెట్టి పోతల కార్యక్రమం ఒక నెల రోజులు బాగానే గడిచింది. తర్వాత మొదలైంది తెగులు మెల్లిగా. ఈ మాత్రం వాట్సాప్ గ్రూప్ కి అడ్మిన్ ని గనుక ఈ పంచాయతీలు తీర్చలేక చచ్చే చావు వచ్చింది. గ్రూప్ మెస్సేజీల అసలు ఉద్దేశ్యం దారి తప్పడం మొదలయ్యింది.

"అపార్ట్మెంట్ 202 వాళ్ళు ఇచ్చిన అవకాడోలలో రెండు మేము తినేలోపు ముగ్గి పాడైపోయాయండీ, కాబట్టి మిగతా నాలుగింటికే నేను వాళ్ళకి డబ్బు ఇస్తాను. వాళ్ళకి మీరే చెప్పండి ."

"మా వాటాకి కాస్త తక్కువ వచ్చాయండి, తూకాలు సరిగా సాగడం లేదు."

" మొన్న మేము ఇచ్చిన పాల క్యానుకి డబ్బు తిరిగి ఇవ్వలేదు అపార్ట్మెంట్ 512 వాళ్ళు. కాబట్టి వారి దగ్గర మేము తెచ్చుకున్న పనీరుకి, గుడ్లకి అది జమ చేసేసుకోండి."

"మొన్న ఎవరో ఇండియా వెళ్లేముందు పెట్టిన నా మెసేజి చూసి మా ఇంటికి వచ్చి వున్న పచారీ సామాను అంతా తీసుకెళ్లారు.ఇప్పటికీ ఏ సమాచారమూ లేదు. తిరిగి వచ్చేసరికి ఏ అపార్ట్మెంట్ వారో నాకు గుర్తులేదు, కాస్త అది ఎవరు పట్టుకెళ్లారో చెప్పి డబ్బులు పంపండి ."

"సి బ్లాక్ 304 లో శారీస్ ఫైనల్ సేల్ నడుస్తోంది, చూడాలి అనుకున్న వారు రావొచ్చు. ఇండియా నుండి లేటెస్ట్ మోడల్ చిలకలపూడి సరుకు (వన్ గ్రామ్ గోల్డ్ ) దిగింది, డోంట్ మిస్."

"మొన్న అపార్ట్మెంట్ 609 నుండి తెచ్చుకున్న నిమ్మకాయలు ఆర్గానిక్కువని మోసం చేసి మాములు నిమ్మకాయలు ఇచ్చారు. దీనిపై చర్చించాలి ."

"మా ఇంటికి చీజ్ స్టిక్స్, యోగర్ట్ పంపకాలకి వచ్చిన అపార్ట్మెంట్ 401 వాళ్లు అవి పెట్టి ఇచ్చిన పింక్ కలర్ పూలు ఉన్న క్యారీ బ్యాగ్ తిరిగి ఇవ్వలేదు . ఇలా బాధ్యత లేని వాళ్ళని గ్రూప్ నుండి బ్లాక్ చేసి పారెయ్యండి అడ్మిన్ గారు."

"అసలు నన్ను బ్లాక్ చెయ్యమని చెప్పడానికి తాను ఎవరో చెప్పమనండి అడ్మిన్ గారూ ముందు?"

"అర్జెంటుగా స్ప్రింగ్ ఆనియన్స్ కట్ట, షెజ్వాన్ సాస్ కావాలి, ఎవరింట్లో అయినా మిగులు ఉందా?"

"సి బ్లాక్ లో శారీ సేల్ లో బ్యూటీ కేర్ ప్రొడక్ట్స్ కూడా పెడుతున్నారట. హెన్నా టాటూ కూడా ఉంటుంది. తప్పకుండా రండి."

ఇలా అర్ధం పర్థం లేకుండా వచ్చే మెసేజీలను హేండిల్ చెయ్యలేక వీరి అలకలు , కోపాలూ , తాపాలూ తీర్చలేక అసలు ఇంతకీ ఈ గ్రూప్ ఎందుకు పెట్టామో అన్న ఆలోచనే మర్చిపోవలసి వచ్చింది. 'ఆహారపు వ్యర్ధాలను తగ్గించడం ఎలా?' అన్నది మానేసి చక్కగా ఈ గ్రూప్ ని కూడా 'ఇన్ఫర్మేషన్ ఎక్స్చేంజి సెంటర్' గా మార్చేసుకున్నారు. అంతే , "ఈ రోజు, ఈ పూట , ఈ క్షణం నా అవసరం తీరితే చాలు," అనే మనస్తత్వం మారేదాకా మనం ఇంతే.

ఆ గ్రూపుని వారి వ్యక్తిగత అవసరాలకి వదిలేసి నేను గ్రూపు సన్యాసం చేసేసాను. తల మీద పెద్ద భారం దించినంత పనైంది. అప్పటినుండి చక్కగా ప్రతి శనివారం "ఫార్మర్స్ మార్కెట్" కి వెళ్లి శాంపిల్ ముక్కలు తిని నాకిష్టమైన, నాకు నచ్చిన పళ్ళు, కూరగాయలు "మాకు మాత్రం సరిపోయేటన్ని" తెచ్చుకోవడం మొదలుపెట్టాను.

*(వచ్చేనెలలో అమెరికా అమ్మాయి ఏం చెబుతుందో.. ఎదురుచూద్దాం..!!)*

Post your comments